క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో పశుగణన సర్వే పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం, కండ్రిక గ్రామాల్లోఅఖిల భారత పశు గణన సర్వేను క్షేత్రస్థాయిలో శుక్రవారం పశువైద్యాధికారి పీర్ అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిశీలన ద్వారా పశుగణన చేస్తున్న ఎన్యుమరేటర్లు వాస్తవ గణాంకాలు నమోదు చేస్తున్నదీ, లేనిదీ తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకోమారు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. పాడి పశువులు, పాడి రైతుల అభ్యున్నతికి, పథకాలను రూపకల్పన కోసం సర్వే ఉపయోగపడుతుందన్నారు.

24న బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం

మంగళగిరి: నగరంలో వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ సన్నాహక సమావేశం ఈ నెల 24 ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో 12న పొన్నవాహన ఉత్సవం, 13న కల్యాణం, 14న దివ్య రథోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన చర్యలకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక వేత్తలు, ప్రజలు సలహాలు ఇవ్వాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృత ప్రచారం



తాడేపల్లిరూరల్ : కృష్ణా, గుంటూరు పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఇప్పటం గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ 18 ఏళ్లగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్స్, అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు తదితర అన్ని వర్గాల ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. సీఐటీయూ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం పల్లె కృష్ణ, డీవైఎఫ్ఐ నాయకుడు పల్లె భార్గవ్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో సీపీఆర్ చికిత్సపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండెపోటుకు గురైన వారికి అత్యవసర సమయంలో చేయాల్సిన సీపీఆర్‌పై ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యులు, స్మార్ట్ విలేజ్ రివల్యూషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చినట్లు సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్ తెలిపారు. వెయ్యిమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. వైద్యులు డాక్టర్ రాకేశ్ మాట్లాడుతూ సీపీఆర్ ప్రాణాలను రక్షిస్తుందని, ప్రజల్లో కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె. రాజశేఖరరావు, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య



ఫిరంగిపురం: సాగు భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా భూ ఆధార్ యూనిక్ నంబరు కేటాయించనున్నట్లు ఏవో వాసంతి శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద ఇప్పటికే 15రోజులుగా రైతులకు సంబంధించి వివరాలు నమోదు గ్రామ వ్యవసాయ సిబ్బంది చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబరుతో లింకు అయిన ఆధార్ నమోదు చేస్తారన్నారు. మండలంలోని 18 గ్రామాల్లో ఇప్పటి వరకు 5,500 మందిరైతులకు యూనిక్ నంబర్‌కోసం ఆన్‌లైన్ చేసినట్లు చెప్పారు. 4వేల మంది రైతులు చేయించుకోవాలన్నారు. మరో వారం రోజుల పాటు ఉండే ఆన్‌లైన్ సేవలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలని చెప్పారు.

నిఘా నీడలో తాడికొండ

- మండలంలో 200 సీసీ కెమెరాల ఏర్పాటు
- నేరాల నియంత్రణకు పోలీసుల ముందడుగు
- ప్రధాన కూడళ్లు, రద్దీ దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరి నిబంధన



సీసీ కెమెరాలు బిగిస్తున్న పోలీసులు



సీసీ కెమెరాలు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పెరిగిన అపరిచితుల తాకిడి, నేరాల నియంత్రణకు తాడికొండ పోలీసులు ముందుడుగు వేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడా లేనంతగా కేవలం 20 రోజుల్లో 200 సీసీ కెమేరాలు ఏర్పాటు చేయించి మండలాన్ని నిఘా గుప్పిట్లో బంధించారు. ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే దుకాణాలు, హోటళ్లు, టీ స్టాళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ నాయకులు, దేశ నాయకుల విగ్రహాల వద్ద సీసీ కెమేరాల ఏర్పాటు చేశారు. గతంలో ద్విచక్ర వాహనాల దొంగలు, రాత్రివేళ ఆకతాయిలు, మద్యం బాబుల గందరగోళంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. అయితే ప్రస్తుతం సీసీ కెమేరాల ఏర్పాటు కారణంగా ప్రధాన రహదారుల వెంట ఎక్కడైనా వివాదాలు జరిగితే వెంటనే నిందితులను గుర్తించి, పట్టుకొనే వెసులుబాటు ఉంది. ద్విచక్ర వాహనాల దొంగలు, రాత్రిళ్లు పెట్రోల్, డీజిల్ దొంగతనం చేసిన దొంగల తాకిడి ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం ఈ సమస్యకు ఇక పూర్తి స్థాయిలో చెక్ పడనుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమేరాల ఏర్పాటుకు దాతలు, దుకాణ యజమానులు, పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, వారికి అవగాహన కల్పించడం ద్వారా పోలీసులు ఈ ప్రగతి సాధించారు. అసలే రాజధాని ప్రాంతం కావడంతో ఇకపై అపరిచిత వ్యక్తుల కదలికలు పెరిగిపోయే పరిస్థితి ఉన్న నేపథ్యంలో సీసీ కెమేరాల ఏర్పాటు ద్వారా కొంత నేరాలు, వివాదాల నియంత్రణకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెప్పిందే తడవుగా జిల్లాలోనే అత్యధికంగా సీసీ కెమేరాల ఏర్పాటు చేసినందుకు గాను తాడికొండ సీఐ కె.వాసును జిల్లా ఎస్పీ అభినందించారు. తాడికొండ మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఈ సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ పూర్తికాగా మరో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి



నేరాల నియంత్రణకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఏర్పాటు దాదాపుగా పూర్తయింది. దాతలు స్పందించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చారు. మరో 50 కెమెరాలను వారం రోజుల్లో బిగించేలా చర్యలు తీసుకుంటున్నాం. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌పై కూడా అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

– కె.వాసు, సీఐ, తాడికొండ

108 అంబులెన్స్ రాకుంది.. ట్రాక్టరే దిక్కైంది..



108 వాహనం రాకపోవడంతో క్షతగాత్రుడిని ట్రాక్టర్‌లోకి తీసుకెళ్తున్న స్థానికులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలి గ్రామ శివారులో శుక్రవారం అతివేగంగా ఓ ఆటో వచ్చి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని ఢీ కొట్టింది. ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన వివరాల మేరకు.. కాజ టోల్ గేట్ వద్ద విధులు నిర్వహించి పెనుమూలి మీదుగా తెనాలి రూరల్ పరిధిలోని కొప్పాల గుడివాడ వెళ్తుండగా.. ఎదురుగా అతివేగంగా వచ్చిన ట్రాలీ ఆటో ద్విచక్ర వాహనంను ఢీకొట్టింది. దీంతో కె.రమేష్ రోడ్డుపై పడిపోయాడు. ఆటో పక్కనే పంటకాలువలోకి దూసుకుపోయింది. రమేష్‌కు కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అపస్మారక స్థితిలోకి జారుకున్నాడు. ఇతర వాహనదారులు రమేష్ పరిస్థితి గమనించి 108కు సమాచారం అందించారు. గంట సమయం అయినా అంబులెన్స్ రాకపోవడంతో స్థానికులు గాయపడిన రమేష్‌ను ఓ ట్రాక్టర్‌లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టోల్‌గేట్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108కు ఫోన్ చేసినా ఎటువంటి సమాధానం లేదని అందువల్లే రమేష్‌ను ట్రాక్టర్‌లో తీసుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు భద్రతా సూచనలతో ప్రమాదాల నివారణ



అవగాహనా ర్యాలీలో పోలీసులు, కళాశాల విద్యార్థులు

లాం(తాడికొండ): రహదారి భద్రతా సూచనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తాడికొండ ఎస్ఐ జేత్యా నాయక్, ఈస్ట్ ట్రాఫిక్ జోన్ ఎస్ఐ డి.రవీంద్ర బాబు అన్నారు. లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు రోడ్డు భద్రతా ట్రాఫిక్ రూల్స్‌పై నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రసంగించారు. హెల్మెట్ వాడకం తప్పనిసరి అని సూచించారు. దీనిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో అజాగ్రత్తలు, అప్రమత్తతతో పాటించాల్సిన విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అసోసియేట్ డీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

పార్టీని పటిష్టం చేద్దాం



నూతనంగా ఎన్నికైన అనుబంధ విభాగాల అధ్యక్షులతో దొంతిరెడ్డి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: పార్టీని పటిష్టం చేయాల్సిన బాధ్యత అనుబంధ సంఘాల మీద ఉందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. నూతనంగా నియమితులైన పార్టీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు శుక్రవారం మంగళగిరి ఆత్మకూరు పరిధిలో ఉన్న పార్టీ కార్యాలయంలో దొంతిరెడ్డి వేమారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీవీఆర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే రైతు భరోసా, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్ వంటి పథకాలు ఎప్పుడో లబ్ధిదారులకు అందేవన్నారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న కాలంలో ప్రతి కార్యకర్తకు పార్టీతో పాటు అధినేత కూడా అండగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులకు దొంతిరెడ్డి వేమారెడ్డి అభినందనలు తెలిపారు.

మంత్రి నారా లోకేష్ మాట నిలబెట్టుకోవాలి



తాడేపల్లిరూరల్ : రాష్ట్ర మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె. ఆదినారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గత 79 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష 80వ రోజుకు చేరుకుందని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ నాయకులు, ఎం.గురవయ్య, బి. దానయ్య, సుబ్బారావు, రమాదేవి, ఆరిఫ్, దుర్గా భవాని, సాల్మన్ రాజు, వేముల లక్ష్మి, సామ్రాజ్యం పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. యువకులకు గాయాలు

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వివరాల మేరకు.. గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళ్తున్న షేక్ సలీమ్ ఆనే యువకుడు ఎదురుగా వస్తున్న వాహనంపై వస్తున్న పెదకాకానికి చెందిన జి.రాంబాబును గమనించక ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనాలు నడపుతున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో ఉన్న ఇద్దరినీ స్థానికులు పక్కనే ఉన్న ఆసుపత్రికి తరలించారు.

హైరిస్క్ గర్భిణుల వివరాలు నమోదు



ఫిరంగిపురం: హైరిస్కు గర్భిణులను గుర్తించి వారి వివరాలను ఆర్సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు వైద్యురాలు శాంతి చెప్పారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 109 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి షుగర్, బీపీ, థైరాయిడ్, గుండెసంబంధిత వ్యాధులు ఉన్న గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్య వివరాలు యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ప్రతి నెలా నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో వారికి పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి మందుల అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్‌లోనే విద్యార్థుల జీవితాలు మలుపు

ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ తుమ్మ శశికాంత్



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న తుమ్మ శశికాంత్

మంగళగిరి టౌన్: విద్యార్థుల జీవితాలను ఇంటర్మీడియట్ విద్య మలుపు తిప్పుతుందని ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ తుమ్మ శశికాంత్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని చింత క్రింది కనకయ్య జూనియర్ కళాశాలలో శుక్రవారం కళాశాల 53వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. తుమ్మ శశికాంత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. విద్యార్థి తన భవిష్యత్తు లక్ష్యం, ఏం సాధించాలనుకుంటున్నారో ఆలోచించుకుని దానిని బట్టి ఇంటర్ తరువాత కోర్సులను ఎంపిక చేసుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కళాశాల ప్రెసిడెంట్ చింతక్రింది కనకయ్య, సెక్రటరి అండ్ కరస్పాండెంట్ గంజి చిరంజీవి, పాలక వర్గం, కళాశాల ప్రిన్సిపల్,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చర్మకారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి

దుగ్గిరాల: మండల కేంద్రంలో చర్మకారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వాలని శుక్రవారం చార్మకార సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బుల్లా రాజారావు డిమాండ్ చేశారు. దుగ్గిరాలలో జరిగిన కార్యక్రమంలో రాజారావు మాట్లాడుతూ మండల కేంద్రంలో చర్మకారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, ఇవ్వాలన్నారు. చర్మకారులు, డప్పు కళాకారులు పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌లను త్వరగా మంజూరు చేయాలని, ప్రత్యేక రుణాలు ఇవ్వాలని తీర్మానించి మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం సమర్పించారు. సెక్రటరీ కె.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ జి.సువర్ణరాజు, ఎం.దైవ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.క్రిష్టఫర్, పి.శ్యామూల్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

దుగ్గిరాల: దుగ్గిరాలలో బాలుర ఉన్నత పాఠశాలలో 286, 287, 288 మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఐ.సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఎమ్మెల్సీ ఓటర్లు 2,254 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పిన కారు



మేడికొండూరు : అదుపుతప్పి కారు రాళ్ల గుట్టను ఢీకొట్టిన ఘటన మండల పరిధిలోని విశదల వద్ద శుక్రవారం జరిగింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలయ్యాయి. వీరు గుంటూరు హాస్పిటల్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో మాచర్లకి వెళ్తున్న సమయంలో విశదల అడ్డరోడ్డు వద్ద రాగానే ముందున్న లారీని అధిగమించడంలో కారు అదుపు తప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న రాళ్లగుట్టను ఒక సారిగా ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలయ్యాయి.

ఆందోళన చేపట్టిన ఎస్‌బీఐ ఉద్యోగులు



బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మంగళగిరి టౌన్ : మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా 9 బ్యాంక్ ఉద్యోగుల సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడంతో దానిలో భాగంగా యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఎస్‌బీఐ ఉద్యోగులు గౌతమ బుద్ధ రోడ్డులోని మెయిన్ బ్రాంచ్ ఎదుట శుక్రవారం విధుల అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ మంగళగిరి మాడ్యూల్ రీజనల్ సెక్రటరి మేగ్యా నాయక్ మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పని, అన్ని విభాగాల్లో ఉద్యోగుల నియామకాలతో పాటు ఇతర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో మార్చి 24 నుంచి రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మ్యాన్, ఆఫీసర్ డైరెక్టర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ సమ్మెలో 9 బ్యాంకింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉద్యోగులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మాడ్యుల్ జోనల్ సెక్రటరి ఏవీ నాగరాజు, బ్యాంచ్ మేనేజర్లు విజయ్, రజనీస్, సుజాత, విష్ణువర్ధన్ రెడ్డి, బ్యాంకు ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



దుగ్గిరాల: దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రధానోపాధ్యాయురాలు శోభాదేవి మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తించబడుతోందన్నారు. విద్యార్థులకు పాటలు, పద్యాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు సహకరించండి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు అందరూ సహకరించాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి కోరారు. సాలీపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం సతీష్ పాల్ రాజ్ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల పెరుగుదలకు నీటి అవాసాలే కారణమన్నారు. దోమలు నీటిలో గుడ్లు పెట్టి వాటి ద్వారా ఉత్పత్తిని పెంచుకుంటాయని తెలిపారు. ఇవి కుట్టడం వలన అనేక వ్యాధులు సోకుతాయని చెప్పారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి ఆవరణలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. మలేరియా అధికారులు అందె బాలచంద్రమౌళి, వంగాల పున్నారెడ్డిలు మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గూన్యా, మెదడువాపు, జీకా వైరస్, బోదకాలు, తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకంఠ ఉమాకాంత్, దీపాల శ్రీనివాసరావు, చింతాల ప్రసన్న పుష్పలత, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి గెలుపునకు ప్రచారం



దుగ్గిరాల: మండలంలోని ఈమని, కంఠంరాజు కొండూరు గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి లక్ష్మణరావుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు, వై.స్టాలిన్, బాబురావు, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.